మెయిన్
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 8
సంచిక : 204
పేజీలు : 3
ఆదివారం 22 ఫిబ్రవరి, 2026
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ




# పైరవీలు పని చేయవు

## మెరిట్ ఉన్నవారికే పార్టీలో గుర్తింపు

## శిక్షణా తరగతులను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

**టీ మీడియా, ఫిబ్రవరి 21, వికారాబాద్ :**

కాంగ్రెస్ పార్టీలో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే సంస్కృతి, స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి పార్టీలో లేదన్నారు. మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసిన వాళ్లం అవుతామని పార్టీ నాయకులను ఉద్దేశించి అన్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగించారు.

### కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేయాలనే కుట్ర జరుగుతోంది

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మెజార్టీ 2 శాతమే తేడా అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్నెళ్ల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ 4 శాతానికి పెరిగిందన్నారు. రెండేళ్ల తర్వాత జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ 12 శాతమని వివరించారు. కార్యకర్తల కృషి, ప్రజల నమ్మకం వల్లే కాంగ్రెస్ ఓటు శాతం పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ కుటుంబంలో 3 తరాలు దేశం కోసం ప్రాణాలు అర్పించారని, ఆయనకు సొంత ఇళ్లు కూడా లేదన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన రాహుల్‌గాంధీ కుటుంబంపై ఇవాళ నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని ఐక్యంగా ఉంచే కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీని కనుమరుగు చేయాలని కుట్ర జరుగుతోందని రేవంత్ రెడ్డి తెలిపారు.

పార్టీ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ పైరవీల కోసం తిరిగితే ప్రజల్లో, పార్టీలో చులకన అవుతారని రేవంత్ రెడ్డి సూచించారు. వాటిని వదిలేసి ప్రజల తరఫున పోరాడితే గౌరవం, మర్యాద తప్పక పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. సొంత అజెండా వదిలేసి ప్రజా అజెండా, పార్టీ అజెండా కోసం కృషి చేయాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. సమస్యలపై కొట్లాడితే స్వపక్షంతో పాటు విపక్షం కూడా గౌరవిస్తుందన్నారు.





### గాంధీ కుటుంబం దేశం కోసం ప్రాణాలర్పించింది

మోతీలాల్ నెహ్రూ రూ.వేల కోట్ల ఆస్తులను దేశం కోసం త్యాగం చేశారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశం కోసం ఎన్నో ఏళ్లు జైలులో ఉన్నారన్నారు. ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన కొన్నాళ్లకే గాంధీజీని కోల్పోయామన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని సీఎం గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారని రేవంత్ వివరించారు. డీసీసీ పదవి చాలా విలువైనదని, వచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేసుకోవద్దని కోరారు. డీసీసీ నుంచి పీసీసీ, ఎమ్మెల్యే, ఎంపీ, సీఎం కావొచ్చన్నారు. ఏఐసీసీ ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ జిల్లా అధ్యక్షులకు (డీసీసీ) శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు.

### కాంగ్రెస్ అధ్యక్ష పదవి చాలా విలువైంది

కాంగ్రెస్ అధ్యక్ష పదవి చాలా విలువైంది.. దాన్ని ప్రజల కోసం వాడుకోవాలని.. లేదంటే మిమ్మల్ని ఎవరు కాపాడలేరని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తాజాగా పార్టీ క్యాడర్‌తో ఏర్పాటు చేసిన శిక్షణా తరగతుల సమావేశంలో సీఎం రేవంత్ ప్రసంగించారు. అందరం కలిసి పని చేస్తే.. సరిగ్గా రెండున్నర ఏళ్లలో అధికారంలోకి వచ్చాం.. వందేళ్ళ చరిత్ర కలిగిన పార్టీ కాంగ్రెస్.. తరవాత సీపీఐ ఉందని చెప్పారు. మిగిలిన పార్టీలు తాము తెచ్చిన స్వాతంత్ర్యం తర్వాత ఏర్పడ్డాయన్నారు. అవే ఇప్పుడు కాంగ్రెస్ ముక్త్ భారత్ అంటున్నాయని.. పార్టీ విధానమే కాదు.. ప్రజల సమస్యల్ని అర్థం చేసుకోవాలని క్యాడర్‌కు సూచించారు. రాజ్యాంగం మార్చాలని ఒక పక్క.. రిజర్వేషన్లు రద్దు చేయాలని మరో పక్క కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. పది రోజులు ఇక్కడ ఉండటం శిక్ష అనుకుంటే ప్రయోజనం ఉండదని.. శిక్షణ అనుకుంటే పార్టీలో మీ అవకాశాలు మెరుగు పడుతుందని చెప్పారు. ఎవరికి వారసత్వంగా హోదా రాలేదు.. షర్మిలకు అవకాశం ఉన్నా... ఆమె తీసుకోలేదన్నారు. బ్రిటీష్ వాళ్ళు.. గాంధీ మీదకు లాఠీ ఎత్తడానికి కూడా భయపడ్డారని చెప్పారు. కానీ స్వతంత్రం వచ్చిన తర్వతా... బీజేపీ వారసత్వం ఉన్న వాళ్ళు బుల్లెట్‌ల వర్షం కురిపించారని విమర్శించారురాహుల్ గాంధీ 150 రోజులు పాదయాత్ర చేశారని సీఎం రేవంత్ గుర్తు చేశారు. "వైఎస్ గురించి నాకంటే మీకే ఎక్కువ తెలుసు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభివృద్ధి ప్రణాళిక గొప్ప ప్రణాళిక. షర్మిల వైఎస్ పేరు చెప్పుకుని ఏ హోదాకు అయినా వెళ్ళొచ్చు. కానీ అవకాశం కోసం కాంగ్రెస్ కోసం కష్టపడుతున్నారు. అదే మమల్ని పార్టీ జిల్లా అధ్యక్షుల్ని చేసింది. ఈ సామ్రాజ్యం మాదే అని అనుకుంటే అక్కడే మొదలవుతుంది మీ ఫెయిల్యూర్. పార్టీలో అంతర్గతంగా భిన్నాభిప్రాయాలు ఉంటాయి. గాంధీ ఉన్నప్పుడు కూడా ఇలాంటి అనవాయితీ ఉంది. దాన్ని ప్రజా స్వామ్య స్ఫూర్తితో ఆలోచనా చేయాలి. కానీ వ్యతిరేకులను బయటకు పంపాలి అనుకోవద్దు. నేను పీసీసీ అయినప్పుడు ఏం జరిగిందో చూశారు. ప్రతీ నాయకుడి ఇంటికి వెళ్ళిన. నచ్చచెప్పిన. ఆ తరవాత నాయకుల ఆలోచనలో మార్పు వచ్చింది. అందరం కలిసి పని చేస్తే సరిగ్గా రెండున్నర ఏళ్లలో అధికారంలోకి వచ్చాం. డిజిటల్ మెంబర్ షిప్ చేయండి. అత్యధికంగా చేసిన వాళ్లకు రాహుల్ గాంధీతో ఫొటో తీయించాం. మేం అధ్యక్షులం అయ్యాం అని పని వదులుకోవద్దు. డీసీసీ అధ్యక్షులుగా పని చేసిన వాళ్లకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చాం. అక్కడ మిస్ అయిన వాళ్లకు ఛైర్మన్ పదవులు ఇచ్చాం. అనుబంధ సంఘాల బాధ్యతలు తీసుకోండి అని చెప్పిన. కానీ చాలా మంది తిట్టుకున్నారు. నీ టైమ్ బాగుంది. పీసీసీ అయ్యావు అని అన్నారు. కానీ అధికారంలోకి వచ్చాక అనుబంధ సంఘాల అధ్యక్షులకు పదవులు ఇచ్చాం. 37 మంది కార్పొరేషన్ ఛైర్మన్లు అయ్యారు. మీ ప్రతి చర్య మేం గణిస్తున్నాం. ప్రతీ రోజు పరీక్ష పెట్టం. ఏ కోటా లేదు. కాంగ్రెస్‌లో మెరిట్ కోటాలో పాస్ ఐతేనే పదవులు. ఒక కోటాలో డీసీసీ అయ్యారు. డీసీసీ అధ్యక్షుడు ఐతే జాతీయ అధ్యక్షుడితో కలిసి అవకాశం వస్తుంది. ఎడమ బొజ్జు సాధారణ కార్యకర్త. ఆయన్ని పిలిచి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చాం. గెలిచి వచ్చాడు. ఇందిరమ్మ ఇంట్లో ఉండే వాళ్ళు అతను. కాంగ్రెస్ అధ్యక్ష పదవి విలువైంది. దాన్ని ప్రజల కోసం వాడుకోండి. లేదంటే మిమ్మల్ని ఎవరు కాపాడలేరు. పార్టీ పెట్టుకున్న విశ్వాసం వదులుకోవద్దు. మీరంటే నచ్చని వాళ్ళు ఉంటారు. వాళ్ళను కూడా పక్కన పెట్టుకోండి." అని సీఎం వెల్లడించారు. మార్చి 2 వరకు డీసీసీ శిక్షణా తరగతులు జరగనున్నాయి. ఈ కార్యక్రమాలకు ఖర్గే, కేసీ వేణుగోపాల్?లు హాజరు కానున్నారు. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి.




## పేదలకు అండగా ఉంటాం

- ఆదాయం పెంచిపంచుతాం
- 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' లో సీఎం చంద్రబాబు

**టీ మీడియా, ఫిబ్రవరి 21, వినుకొండ :**

గ్రామీణ ప్రాంతాల్లో మార్చి 31 నాటికి వంద శాతం ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే బాధ్యత ప్రభుత్వానిదని సీఎం చంద్రబాబు తెలిపారు. మండలానికి ఒక స్వచ్ఛరథం ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అలాగే వారానికి ఒకసారి గ్రామానికి స్వచ్ఛరథం వస్తుందని చెప్పారు. స్వచ్ఛ రథం వచ్చినప్పుడు పాత వస్తువులు ఇస్తే బదులుగా నిత్యావసరాలు ఇస్తారన్నారు. దీంతో పరిసరాల పరిశుభ్రతతోపాటు ప్రజలకు ఆదాయం వస్తుందని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. స్వచ్ఛరథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలను అందజేశారు. ప్రజావేదిక వద్ద స్టాళ్లను పరిశీలించారు.

### పీహెచ్‌సీని వందపడకల ఆస్పత్రిగా

వినుకొండలో పచ్చదనం పెంచేందుకు నిధులు కేటాయిస్తాం. పశువైద్య కళాశాల, అగ్రికల్చరల్ కాలేజ్ ఏర్పాటు చేస్తాం. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని 2025 జనవరిలో ప్రారంభించాను. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమాలు సాగుతున్నాయి. పచ్చదనం- పరిశుభ్రత, నీరు-మీరుతో ప్రజల వద్దకు వస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటాం.నేను సీఎంగా వచ్చేనాటికి 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. దానిని క్రమంగా తొలగిస్తున్నాం. వర్షాలు పడినప్పుడు భూ జలాలు కలుషితమయ్యే పరిస్థితి ఏర్పడింది. కలుషిత నీళ్లు తాగితే డయేరియా వంటి అనేక సమస్యలు వస్తాయి. ప్రజలకు స్వచ్ఛమైన నీరు ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టాం" అని చంద్రబాబు తెలిపారఎక్కడ ఉన్నా కార్యక్రమానికి హాజరువుతున్నా : "ప్రతి నెల మూడో శనివారం ఎక్కడ ఉన్నా కార్యక్రమానికి హాజరువుతున్నా. మున్సిపాలిటీల్లో ఇంటింటికి వెళ్లి చెత్తను వంద శాతం సేకరిస్తున్నారు. మార్చి 31 నాటికి గ్రామీణ ప్రాంతాల్లోనూ చెత్త సేకరించే బాధ్యత ప్రభుత్వానిది. రాబోయే రోజుల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొస్తుంది. ఇప్పటికే 'సూపర్ సిక్స్' హిట్ అయ్యింది. 'పేదల సేవలో' కార్యక్రమం కింద మొదటి తేదీనే ఇంటింటికి వస్తున్నాం. ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం కింద డబ్బులు ఇస్తున్నాం.ప్రతి ఎకరాకు నీళ్లిస్తున్నాం. గిట్టుబాటు వచ్చే పంటలు వేయిస్తున్నాం. రైతులకు టెక్నాలజీ అలవాటు చేస్తున్నాం. అగ్రికల్చర్ నిపుణులను అందుబాటులోఉంచుతున్నాం. రైతులు సైతం టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నారు. మైక్రో ఇరిగేషన్, బిందుసేద్యం తదితర కార్యక్రమాలను నేనే ప్రారంభించా. వారసత్వంగా వచ్చే పంటలే పండిస్తే ఆదాయం లేకుండా

మిగతా 3లో..

# ఇకపై పొడిగా, రుచికరంగా భోజనం

- మార్చి 1 నుంచిప్రభుత్వ పాఠశాలల్లో స్టీమ్ రైస్

**టీ మీడియా, ఫిబ్రవరి 21, హైదరాబాద్ బ్యూరో :**

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం ద్వారా అనేక మంది విద్యార్థులు లంచ్? బాక్స్ సమస్య నుంచి దూరం అయ్యారు. స్కూల్?లోని విద్యార్థులకు చదువుతో పాటు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. సాధారణంగా పిల్లలు మధ్యాహ్న భోజనం అంటే ఇష్టంగా తింటారు. అయితే వండిన ఆహారం రుచి లేకున్నా, వారికి నచ్చకున్నా అన్నాన్ని పారవేస్తారు లేదా తినడమే మానేస్తారు. దీంతో వారి ఆరోగ్యంపై అది ప్రభావం చూపుతుంది. ఇదే తరహాలో రాష్ట్రంలో పలు పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనంలో వినియోగించే అన్నం ముద్దగా మారడంతో విద్యార్థులు తినేందుకు ఇష్టపడటం లేదు. ఈ సమస్యపై దృష్ట పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాలల్లో స్టీమ్? రైస్?ను సరఫరా చేసేందుకు సిద్ధమవుతోంది. వివరాల్లోకి వెళితే,

**ముద్దగా మారుతున్న అన్నం**

ఇక్కడ కనిపిస్తున్నది సూర్యాపేట జిల్లా తుంగతుర్తి జిల్లా పరిషత్ హైస్కూల్? విద్యార్థులు. ఈ పాఠశాలలో వంట వాళ్లు శ్రద్ధ పెట్టి వంట చేసినా



అది కొత్త బియ్యం కావడం వల్ల అన్నం ముద్దగా మారుతోంది. దీంతో విద్యార్థులు తినేందుకు శ్రద్ధ చూపడం లేదు. రాష్ట్రంలో అనేక చోట్ల ఇదే రకమైన పరిస్థితి ఉంది.

**తేమ శాతం ఎక్కువగా ఉండటంతో**

ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనంలో పిల్లలు అనేక రకాల సమస్యలను చెబుతూ ఉంటారు. వాటిలో ప్రధానమైనది అన్నం ముద్దగా మారడం. ఇలా అవ్వడంతో అన్నం గొంతులోకి దిగేందుకే కష్టంగా ఉంటుందని విద్యార్థులు వాపోతున్నారు. నిజానికి విద్యార్థుల భోజనానికి వండేది సన్నబియ్యమే అయినప్పటికీ, అది కొత్త బియ్యం కావడంతో ఇలా ముద్దగా తయారవుతోంది. నిజానికి కొత్త బియ్యంలో తేమ శాతం కాస్త ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగానే పాతబియ్యంతో పోల్చితే కొత్త బియ్యంతో వండిన అన్నం ముద్దగా తయారవుతుంది.

**స్టీమ్ బియ్యం సరఫరా**

ఈ సమస్య వల్ల పిల్లలు ఇష్టపూర్వకంగా తినలేకపోతున్నారు. ఈ సమస్యను గమనించిన పౌర సరఫరాల శాఖ రాష్ట్రవ్యాప్తంగా స్టీమ్? బియ్యాన్ని సరఫరా చేయాలని నిర్ణయించింది. దీనిని మార్చి 1 నుంచి అమలు చేసేందుకు నిశ్చయించింది. ఈ మేరకు తాజాగా అన్ని జిల్లాల అధికారులకు సర్క్యులర్ విడుదల చేసింది. స్టీమ్?రైస్? వంట రుచికరంగా, గొంతులో దిగేలా పొడిపొడిగా, మృదువుగా ఉంటుందని అధికారులు అంటున్నారు.

**అన్ని ప్రభుత్వ పాఠశాలలకూ**

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సుమారుగా 25 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వారందరికీ మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. అదనంగా సంక్షేమ వసతి గృహాలలో ఉంటూ చదువుకునే 10 లక్షల మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. హాస్టళ్ల విద్యార్థులకూ అవసరమైన సన్నబియ్యాన్ని పౌర సరఫరాల శాఖనే పంపిణీ చేస్తోంది. నిజానికి కొత్త బియ్యాన్ని కొన్ని నెలలు నిల్వ చేస్తే అది పాత బియ్యంగా మారుతుంది. అయితే దీనిని నెలల తరబడి నిల్వ చేసేందుకు అనేక సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని స్టీమ్? రైస్?ను సరఫరా చేసేందుకు పౌర సరఫరాల శాఖ నిర్ణయం తీసుకుంది.

**ఆవిరితో ప్రాసెస్? చేయడం ద్వారా**

అంగన్?వాడీ కేంద్రాలతో పాటు అన్ని ప్రభుత్వ స్కూళ్లకు స్టీమ్? రైస్? సరఫరా చేయనుంది. సాధారణంగా వడ్లను మరాడిస్తే కొంత నూకలు వస్తాయి. గింజ విరుగుతుంది. యాసంగి సీజన్?లో వడ్లు అయితే గింజ విరగడం మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో మరాడించక ముందే ధాన్యాన్ని ఆవిరితో ప్రాసెస్? చేస్తారు. ఇలా చేయడం వల్ల స్టీమ్? రైస్? గింజ విరగదు. ఈ బియ్యాన్ని వండినా ముద్దగా అవ్వదు. ఈ అన్నం పొడిగానూ తినడానికి మృదువుగా, సులభంగా ఉంటుంది.

# సుప్రీంకోర్టు మొట్టికాయల ఎఫెక్ట్


3లో..

## రెండు రాజ్యసభ సీట్లు ఖాళీ

### జోరుగా లాబీయింగ్

**టీ మీడియా, ఫిబ్రవరి 21, హైదరాబాద్ బ్యూరో:**

తెలంగాణ నుంచి రాజ్యసభ రేస్‌లో ఉన్న నాయకులు ఎవరు? ఉన్న రెండు సీట్లలో ఒకటి ఆల్రెడీ రిజర్వ్ అయిపోయిందన్నది నిజమేనా? అదే నిజమైతే.... ఎవరి కోసం రిజర్వ్ చేశారు? మిగిలి ఉన్న ఒక్క సీటు కోసం ఎంతమంది పోటీ పడుతున్నారు? ఎవరి అడ్వాంటేజ్ ఏంటి? అసలు ఢిల్లీ పెద్దల మనసులో ఏముంది?



తెలంగాణ నుంచి రెండు రాజ్యసభ సీట్లు ఖాళీ అవుతున్నాయి. సహజంగానే..... ఆశావహుల ట్రయల్స్ మొదలైపోయాయి. కాంగ్రెస్ నేతలు ఎవరికి వారు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ మొదలెట్టేశారట. అధిష్టానం దగ్గర ఇటీవల జరిగిన తెలంగాణ కాంగ్రెస్ నేతల సమావేశంలో కూడా రాజ్యసభ ఎన్నికలపై చర్చ జరిగినట్టు తెలిసింది. ప్రస్తుతం ఖాళీ అయిన రెండు

మిగతా 3లో..

## భారత్‌లోకి భారీగా పెట్టుబడులు

- డిక్లరేషన్'కు 88 దేశాల సంతకాలు

**టీ మీడియా, ఫిబ్రవరి 21, ఢిల్లీ బ్యూరో:**

కృత్రిమ మేధ భవిష్యత్తుపై అంతర్జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం కుదిరింది. భారత్ నేతృత్వంలో జరిగిన 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో రూపొందించిన 'ఢిల్లీ డిక్లరేషన్' కు ప్రపంచ అగ్రరాజ్యాలైన అమెరికా, బ్రిటన్, చైనా, ఫ్రాన్స్, రష్యాతో సహా మొత్తం 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు తమ మద్దతును తెలిపినట్లు



కేంద్ర సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఏఐ లక్ష్యాల సహకారంలో ఇదొక మైలురాయిగా పేర్కొన్నారు. ఫిబ్రవరి 16 నుంచి 20 వరకు దిల్లీలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు.ప్రధాని మోదీ ప్రతిపాదించిన "హ్యూమన్-సెంట్రిక్ ఏఐ" విజన్‌ను ప్రపంచ దేశాలు స్వీకరించాయని కేంద్ర మంత్రి వివరించారు. ఏఐ సాంకేతికత ప్రయోజనాలు కేవలం కొద్ది దేశాలకు లేదా సంస్థలకు మాత్రమే పరిమితం కాకుండా, ప్రపంచవ్యాప్తంగా అన్ని వర్గాల

మిగతా 3లో..






# అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతాం

- జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర...

**టీ మీడియా, ఫిబ్రవరి 21,బాన్సువాడ:**

అసాంఘిక శక్తులు సృష్టిస్తున్న వారిపై ఉక్కు పాదం మోపుతామని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పేర్కొన్నారు. శనివారం బాన్సువాడ పట్టణంలోని పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ శుక్రవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని ఓ మాల్??లో సేల్స్?గల్స్?తో ఓ వ్యక్తి వాగ్వాదానికి దిగాడన్నారు. ఈ విషయమై తమకు ఫిర్యాదు అందడంతో అతడిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. అయితే కొందరు వ్యక్తులు ఈ ఘటనను దృష్టిలో పెట్టుకుని శుక్రవారం రాత్రి బాన్సువాడ పోలీస్?స్టేషన్? ?ఎదుట రాళ్లు రువ్వుతూ హంగామా చేశారన్నారు.ఈ ఘటనలో తమ కానిస్టేబుల్?కు గాయాలయ్యాయని తెలిపారు. కానిస్టేబుల్? ఇచ్చిన ఫిర్యాదు మేరకు 42 మందిపై కేసులు నమోదు చేయబోతున్నామని తెలిపారు. అలాగే బాన్సువాడ బంద్? అంటూ కొందరు పిలుపునిచ్చారని.. సోషల్? మీడియాలో సైతం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని.. వారిని సైతం అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇప్పటికే ఒకరిపై కేసు నమోదైందని.. మరికొందరిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు విట్టల్ రెడ్డి శ్రీనివాసరావు పట్టణ సీఐ తుల శ్రీధర్ రూరల్ సిఐ తిరుపతయ్య పోలీస్ సిబ్బంది ఉన్నారు.



# తిరుమలలో రద్దీ

- శ్రీవారి దర్శనానికి 20 గంటల సమయం

**టీ మీడియా, ఫిబ్రవరి 21, తిరుమల :**

తిరుమలలో భక్తుల రద్దీ భారీగా ఉంది. కంపార్ట్ మెంట్లు అన్ని భక్తులతో నిండిపోయి వెలుపల వరకు క్యూ లైన్లలో వేచి ఉన్నారు. సర్వదర్శనం క్యూ లైన్ లోకి ఉదయం టోకెన్లు లేకుండా ప్రవేశించిన భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 20 గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు వెల్లడించారు. ఇక, టైమ్ స్లాట్ దర్శనం భక్తులకు 6 నుంచి 7 గంటల సమయం పడుతుండగా.. మూడు వందల రూపాయల ప్రత్యేక దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులకు శ్రీవారి దర్శనం 3 నుంచి 4 గంటల టైం పడుతుంది. వసతి గృహాల కోసం కూడా గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.: ఆర్ఎస్ఎస్‌కు అధికారం అక్కర్లేదు.. మా లక్ష్యం అది కాదన్న మోహన్ భగవత్అయితే, క్యూ లైన్లలో ఉండే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అన్నప్రసాదం, తాగు నీటి పంపిణీ, నడక దారి భక్తులకు మార్గమధ్యంలో షెడ్ల ఏర్పాటుతో పాటు మాడ వీధులు తదితర ప్రాంతాల్లో కూల్ పెయింటింగ్ వేయనున్నట్లు తెలిపారు. ఇక, నిన్న శ్రీవారిని 68, 156 మంది భక్తులు దర్శించుకున్నారు. 28,295 మంది భక్తులు తలనీలాలు సమర్పించగా.. రూ. 3.46 కోట్ల హుండీ ఆదాయం వచ్చింది.

# చంచల్ గూడ జైలులో ఉగ్ర కుట్ర జరగలే

- జైల్ డీఐజీ శ్రీనివాస్హైదరాబాద్

**టీ మీడియా, ఫిబ్రవరి 21, హైదరాబాద్ బ్యూరో:**




చంచల్ గూడ జైలులో ఉగ్ర కుట్ర జరిగిందంటూ సోషల్ మీడియా, మెయిన్ స్ట్రీమ్ మీడియాలో వస్తోన్న వార్తలపై జైళ్ల శాఖ డీఐజీ శ్రీనివాస్ స్పందించారు. "నిన్నటి నుంచి సోషల్ మీడియా, న్యూస్ ఛానెల్స్?లో చంచల్ గూడ జైలులో ఉగ్ర కుట్ర అని వదంతులు వినిపిస్తున్నాయి. అలాంటి కుట్రలు జైలులో ఏం జరగలేదు.. అవన్నీ వదంతులు మాత్రమే. నేషనల్ సెక్యూరిటీ ఇషఢ్య కాబట్టి వార్తలు ప్రసారం ముందు అధికారులను వెరిఫై చేసుకోవాలి.పుకార్లు స్ప్రెడ్ చేయడం వల్ల జనాలు భయాందోళనకు లోనయ్యే అవకాశం ఉంటుంది. చంచల్ గూడ జైలులో లష్కరే తోయిబాకు చెందిన జాయిద్ అనే ఉగ్రవాది మాత్రమే ఉన్నాడు. అతని భార్య తప్ప అతన్ని కలవడానికి ఎవరూ రారు. సర్వే లైన్స్?లో వారి ములాఖాత్ జరుగుతుంది. వారానికి రెండు ములాఖాత్?లు అందరితో పాటు కాకుండా వాళ్ళకు వేరే సమయం ఉంటుంది" అని డీఐజీ శ్రీనివాస్ వివరణ ఇచ్చారు.దేశంలో ఉగ్రకుట్ర వ్యవహారంలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్?లోనూ విధ్వంసానికి ప్లాన్ చేసినట్లు నిఘా వర్గాలు అనుమానం వ్యక్తంచేశాయి.పేలుళ్లకు చంచల్ గూడ జైలు నుంచే టెర్రరిస్టు స్కెచ్చేసినట్లు గుర్తించాయి. ములాఖత్ లో భాగంగా తనను కలవడానికి వచ్చిన వారితో ఉగ్రదాడులపై సంభాషణలు చేసినట్లు సమాచారం. దీంతో నగరంలోని ముసారాంబాగ్, సైదాబాద్, మలక్పేట్ ప్రాంతాలపై పోలీసులు నిఘా పెట్టారు. లష్కరే తోయిబా చెందిన ఉగ్రవాది కుట్ర చేసినట్లుతెలుస్తోంది.

**ఢిల్లీలో అలర్ట్..**

అయితే.. గత ఏడాది నవంబర్ 10న ఢిల్లీ ఎర్రకోట దగ్గర జరిగిన పేలుళ్లు రిపీట్ అవుతాయా? ఉగ్రవాదులు మళ్లీ స్కెచ్ గీస్తున్నారంటూ ఇంటెలిజెన్స్ రిపోర్ట్స్ చెప్పడం కలకలం రేపింది.. దీంతో దేశవ్యాప్తంగా పలు ప్రాంతాలలో తనిఖీలను ముమ్మరం చేశారు. ఢిల్లీలో మళ్లీ హైఅలర్ట్ ప్రకటించారు.. ఉగ్రదాడి జరగొచ్చన్న ఇంటెలిజెన్స్ హెచ్చరికలతో భద్రతను ఒక్కసారిగా పెంచారు. ఎర్రకోట దగ్గర లష్కరే తోయబా పేలుడుకు పాల్పడవచ్చని అలర్ట్ చేసింది ఇంటెలిజెన్స్.. ఎర్రకోటతోపాటు చాందినీచౌక్‌లోని ఓ ఆలయం దగ్గర పేలుళ్లకు కుట్ర పన్నినట్లు నిఘావర్గాలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా ప్రముఖ దేవాలయాల దగ్గర కూడా పేలుళ్లకు ఉగ్రవాదులు ప్లాన్ చేసినట్లు ఇంటెలిజెన్స్ హెచ్చరించింది. ఈనెల 6న ఇస్లామాబాద్‌లో జరిగిన పేలుళ్లకు ప్రతీకారంగా ఢిల్లీకి ఉగ్రదాడికి ప్లాన్ చేశారని అలర్ట్‌చేసింది. ఇంటెలిజెన్స్ వార్నింగ్‌లతో అప్రమత్తమైన భద్రతావర్గాలు.. ఢిల్లీలోని వి ఐ పీ ప్రాంతాల్లో సెక్యూరిటీని కట్టుదిట్టంచేశారు

గతేడాది నవంబర్ 10న ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన కారు పేలుడులో 15మంది మరణించగా.. 20మంది గాయపడిన విషయం తెలిసిందే.. ఈ కేసులో పలువురిని పోలీసులు అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు.. ఈ క్రమంలోనే.. మళ్లీ పేలుళ్లకు కుట్ర పన్నినట్లు పేర్కొంటుండటం కలకలం రేపింది.

# కూతురికి వీడియో కాల్ చేసి..

## నదిలో దూకిన ఆర్‌టిసి డ్రైవర్

**టీ మీడియా, ఫిబ్రవరి 21, సంగారెడ్డి**



కూతురికి వీడియో కాల్ చేసి మంజీరా నదిలో దూకి ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్?కల్ మండలంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. నారాయణఖేడ్ డిపోలో ఆర్టీసీ డ్రైవర్?గా పనిచేస్తున్న పాపయ్య (49) శనివారం (ఫిబ్రవరి 21) న్యాల్?కల్ మండలంలోని చాల్కి దగ్గర మంజీరా నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.నదిలో దూకే ముందు కూతురికి వీడియో కాల్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు నది ఒడ్డున పాపయ్య దుస్తులు, బైకు గుర్తించి గాలించారు పోలీసులు. నదిలోంచి మృతదేహం వెలికితీసి పోస్ట్?మార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.పాపయ్య స్వగ్రామం ఝరాసంగం మండలం కుప్పా నగర్?గా గుర్తించారు పోలీసులు. పాపయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హద్నూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. వివిధ కోణాల్లో పాపయ్య సూసైడ్ చేసుకోవడానికి గల కారణాలు ఆరా తీస్తున్నారు.

# కాంగ్రెస్ నేత కారుకు నిప్పు..

- బీజేపీ కార్యకర్తల విధ్వంసం

**టీ మీడియా, ఫిబ్రవరి 21, కామారెడ్డి :**



కామారెడ్డిలో హైటెన్షన్ నెలకొంది. అరోరా కాలేజీ భూములు, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భూములు శిశు మందిర్ విషయంలో కాంగ్రెస్ బీజేపీ నేతల సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకున్న క్రమంలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. శనివారం ( ఫిబ్రవరి 21 ) బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి క్యాంపు ఆఫీసు దగ్గరికి చేరుకున్న కాంగ్రెస్ నేత మహేందర్ రెడ్డి ఇతర నేతల కార్లను ధ్వంసం చేసి బీభత్సం సృష్టించారు బీజేపీ కార్యకర్తలు. అక్కడితో ఆగకుండా.. కారుకు నిప్పు పెట్టి హల్చల్ చేశారు.పరిస్థితి అదుపు తప్పడంతో రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను ఘటనాస్థలం నుంచి చెదరగొట్టారు. మంటలు ఆర్పీ కారును అక్కడి నుంచి తరలించారు పోలీసులు. బీజేపీ కార్యకర్తల అత్యుత్సాహం కామారెడ్డిలో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది.శిశు మందిర్ వేదికగా చర్చకు రెండు పార్టీలు సిద్ధం కావడంతో కామారెడ్డిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ నాయకులు సాక్ష్యాధారాలతో చర్చకు రావాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణా రెడ్డి ఛాలెంజ్ విసిరారు. అయితే.. కాంగ్రెస్, బీజేపీ నేతల బహిరంగ చర్చకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు.కామారెడ్డి డిగ్రీ కాలేజీ భూములకు సంబంధించి తనపై కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలకు సాక్ష్యాలు తీసుకొని శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక శిశు మందిర్ వద్దకు రావాలని, తాను స్వయంగా వస్తానని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నాయకులు, కాలేజీ భూముల నుంచి స్థలాలు పొందిన సంస్థల ప్రతినిధులు, అధికారులు వస్తారన్నారు. నిజానిజాలు నిర్ధారణ చేసుకునేందుకు సాక్ష్యాలతో రావాలని కోరారు.డిగ్రీ కాలేజీ భూముల వ్యవహారంలో తనపై చేసిన ఆరోపణలకు చర్చకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. తాము కూడా వస్తామని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత కామారెడ్డిలో పార్టీల మధ్య విమర్శల వేడి రాజుకుంది. కాంగ్రెస్, బీజేపీనాయకులు విమర్శలు, ప్రతి విమర్శలు, సవాళ్లు విసురుకున్నారు.

# మొదటి భార్య చచ్చిపోయిందనుకుని.. ముళ్ల పొదల్లో పడేసి వెళ్లిపోయాడు

**టీ మీడియా, ఫిబ్రవరి 21, పెద్దపల్లి :**



కాల్వ శ్రీరాంపూర్ మండలంలో దారుణం జరిగింది. భార్యను హతమార్చడానికి భర్త యత్నించిన ఘటన కలకలం రేపింది. మొదటి భార్య నూనె పద్మను జాఫర్ ఖాన్ పేట శివారుకు తీసుకువెళ్లి ఆమె భర్త నూనె వెంకటేష్ బండరాయితో తలపై బాదాడు. చనిపోయిందని భావించి చెట్లపొదల్లో పడేసి వెళ్ళిపోయాడు.పద్మ కనిపించకపోవడంతో పెద్దపల్లి పోలీస్ స్టేషన్?లో భర్త వెంకటేష్?పై అనుమానం ఉందని పద్మ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు వెంకటేష్?ను అదుపులోకీ తీసుకొని విచారించారు. జాఫర్ ఖాన్ పేట శివారులోకి తీసుకువెళ్లి బండరాయితో కొట్టి పడవేశానని వెంకటేష్ ఒప్పుకున్నాడు. జాఫర్ ఖాన్ పేట గుట్టకు వెళ్లి మృతదేహం కోసం వెతికిన పోలీసులకు షాకింగ్ దృశ్యం కనిపించింది. రక్తపు మడుగులో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న పద్మను చూసి పోలీసులు విస్తుపోయారు.పద్మను హుటాహుటిన పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. 24 గంటలకు పైగా ముళ్ళ పొదల్లోనే అచేతన స్థితిలో పద్మ ఉండటం గమనార్హం. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్?లోని ఆసుపత్రికి తరలించారు. పోలీసుల తక్షణ స్పందనతో పద్మ ప్రాణం దక్కింది. మంచిర్యాలకు చెందిన పద్మను 15 సంవత్సరాల క్రితం వెంకటేష్ వివాహం చేసుకున్నాడు.గత ఏడేండ్లుగా కోర్టులో విడాకుల కేసు నడుస్తుంది. మొదటి భార్య వద్దని వెంకటేష్ రెండవ పెళ్లి చేసుకున్నాడు. నిన్న (శుక్రవారం) కోర్టులో కేసు ఉండడంతో భర్త వెంకటేష్, మొదటి భార్య పద్మ కోర్టుకు వెళ్ళారు. కోర్టు ముగిశాక మాట్లాడుకుందామని చెప్పి పద్మను బైక్?పై ఎక్కించుకొని వెళ్లి వెంకటేష్ ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. నిందితుడు వెంకటేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# అమ్ముడు పోయిన వ్యక్తులుమాట్లాడటం హాస్యాస్పదం

- కాంగ్రెస్‌లో నిత్య నిరాశవాది శ్రీనివాస్ గౌడ్
- చీర్ల విజయచందర్ ఘాటు దాడి

**టీ మీడియా, ఫిబ్రవరి 21, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లాలో కాంగ్రెస్‌లో ఉంటూ సీనియర్ నాయకుడిని అంటూ చెప్పుకునే శ్రీనివాస్ గౌడ్ గుంట నక్కలా వ్యవహరిస్తున్నారని, అధినాయకుల మెప్పు కోసం తనపై అవాకులు చవాకులు చేస్తే రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుతామని చీర్ల విజయచందర్ ఘాటుగా హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, బి. కృష్ణ, వైస్ చైర్మన్ మధు గౌడ్, కదిరే రాములు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఇకపై ఇలాంటి ఆరోపణలను సహించబోమని స్పష్టం చేశారు. 2014లో వనపర్తిలో కాంగ్రెస్--బీజేపీ మధ్య జరిగిన అపవిత్ర ఒప్పందాలను తాను వ్యతిరేకించానని, బీసీ అభ్యర్థికి మద్దతు తెలుపుతూ చైర్మన్, వైస్ చైర్మన్ కు మద్దతు చేయడం జరిగిందని పేర్కొన్నారు. వ్యక్తిగత స్వలాభం కోసం రహస్య ఒప్పందాలు చేసుకున్న తీరు నచ్చకే తాను ఎదిరించానని, అందుకే అధిష్టానం తనను సస్పెండ్ చేయలేదని తెలిపారు.పార్టీకీ చేసిన సేవలను గుర్తించి మరోసారి పార్టీ టికెట్ ఇచ్చి పార్టీ అధ్యక్ష పదవి కట్టబెటారు.శ్రీనివాస్ గౌడ్ కల్తీ కల్లు వ్యాపారం కోసం పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. గతంలో బిఆర్ఎస్‌తో చీకటి ఒప్పందాలు చేసుకుని హైదరాబాద్‌లో ఆ పార్టీ ప్లెక్సీలు ఏర్పాటు చేసిన ఘనత కూడా ఆయనకేనని విమర్శించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి గ్రాఫ్ తగ్గిందని విషం చిమ్మిన వారు, ఇప్పుడు నకిలీ ప్రేమ చూపుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్ని పదవులు ఉంటే అన్నీ తనకే కావాలనుకునే అవకాశవాది శ్రీనివాస్ గౌడ్ అని దుయ్యబట్టారు. అధికారం లేని సమయంలో నిబద్ధతతో నిరంతరం పార్టీకి పనిచేసిన సీనియర్ నాయకులు ఎటుపోవాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుడు బ్రహ్మంపై రౌడీయిజం ప్రదర్శించారని, అయిన బ్రహ్మం పార్టీ కోసం నోరు మెదపలేదని, ముందొకటి వెనకోటి మాట్లాడే శ్రీనివాస్ గౌడ్ నీచ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీని నాశనం చేసి, స్వలాభం కోసం పార్టీని భ్రష్టుపట్టించిన బి.కృష్ణ ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి అదే ధోరణి కొనసాగిస్తున్నారని ఆరోపించారు. 2014 చైర్మన్ ఎన్నికలో చైర్మన్ అభ్యర్థిగా ఉన్న నువ్వు లోకనాథ్ రెడ్డికి 1 కోటి రూపాయలకు అమ్ముడుపోయింది నువ్వే కథ నువ్వ నా గురించి మాట్లాడేది నువ్వు బి కృష్ణ వి కాదు బ్రోకర్ కృష్ణవి దళారి కృష్ణ. గతంలో బీజేపీ కార్యాలయం కోసం రూ.30 లక్షల విలువైన స్థలాన్ని కొనుగోలు చేసి రూ.80 లక్షలకు బీజేపీ పార్టీకి అమ్మిన బ్రోకర్ కృష్ణేనని ఆరోపించారు. ఇది గ్రహించిన బీజేపీ అధిష్టానం నిన్ను సస్పెండ్ చేసే ఆలోచనలో ఉన్నపుడు గతి లేక కాంగ్రెస్ పార్టీలో చేరవు నువ్వ నాన్ను విమర్శించేది. కల్తీ కల్లు తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్న మధు గౌడ్ కూడా తనపై మాట్లాడటం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. అధికారం లేని సమయంలో కదిరే రాములు ఏనాడు కాంగ్రెస్ పార్టీ కోసం చురుకుగా పనిచేయలేదని, గతంలో ఎమ్మెల్యే మేఘా రెడ్డిని వ్యతిరేకించిన వ్యక్తి ఇప్పుడు బీరాలు పలుకుతున్నాడని విమర్శించారు. మరోసారి తనపై అనవసర వ్యాఖ్యలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తాను ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీకి నిబద్ధతతో పనిచేశానని, పదవులు లేదా డబ్బు కోసం ఎప్పుడూ పాకులాడలేదని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు రవి సాగర్, కృష్ణబాబు, మతీన్, రాజు, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

# హైవేపై బైక్‌ను ఢీ కొట్టిన కారు..ఇద్దరు మృతి

**టీ మీడియా, ఫిబ్రవరి 21, కరీంనగర్:**



ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి రాజీవ్ రహదారిపై బైక్ ను కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ పై వెళ్తోన్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. హుస్నాబాద్ నుంచి తోటపల్లికి వెళ్తుండగా కొత్తపల్లి దగ్గర ఈ ప్రమాదం జరిగింది.ఈ ఘటనతో కాసేపు హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. స్తానికుల సమాచారంతో ఘటనా స్తలానికి వచ్చిన పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతులు అవదూత శ్రీనివాస్, శ్రీరామ రామచంద్రంగా గుర్తించారు. వీరిద్దరూ బొమ్మనపల్లి మండలం చిరుగుమామిడి గ్రామస్తులుగా గుర్తించారు పోలీసులు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంతో స్తానికులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# వైకల్యం విజయానికి అడ్డంకి కాకూడదు

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**టీ మీడియా, ఫిబ్రవరి 20, వనపర్తి బ్యూరో :**



వికలాంగులుగా జన్మించడం తప్పు కాదని అలాంటి వారిని ప్రేమించలేని వ్యక్తులే అసలైన వికలాంగులని, ప్రతి ఒక్కరు వికలాంగుల పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం వనపర్తి జిల్లా వ్యాప్తంగా ఉన్న 30 మంది దివ్యాంగులకు స్కూటీల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.పాత మార్కెట్ యార్డ్ లో చేపట్టిన ఈ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ హాజరై వారికి స్కూటీలను అందజేశారు. వైకల్యంతో ఎన్నో అవరోధాలను, కష్టాలను ఎదుర్కొంటూ జీవితాన్ని జయిస్తూ మనందరికీ స్ఫూర్తిని ఇస్తున్న దివ్యాంగులకు మనం కూడా చేయూతనిద్దాం. వారిని గౌరవిద్దాం. అభిమానిద్దామని వారు సూచించారు. దివ్యాంగులు వికలత్వ భావనతో ఉండరాదని ఆత్మస్థైర్యంతో, పట్టుదల, ప్రతిభతో రాణించాలని. దివ్యాంగులు తమ ప్రతిభతో వివిధ రంగాల్లో రాణించి ఎందరికో స్ఫూర్తిగా నిలవాలన్నారు.దివ్యాంగుల్లో అమోఘ శక్తి దాగి ఉంటుందని, ఆ శక్తిని గుర్తించి ప్రోత్సహిస్తే వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారనీ చెప్పారు.వైకల్యం విజయానికి అడ్డంకి కాదు. ప్రతిభ, ఆత్మవిశ్వాసం ముందుకు నడిపిస్తాయి.అందరం కలుద్దాం అంగవైకల్యం ఉన్నవారికి అండగా నిలబడదామని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పట్టణ కౌన్సిలర్లు దివ్యాంగుల శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్దలు పాల్గొన్నారు.

# కౌన్సిలర్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబెర్స్‌ను సన్మానించిన బంగ్లా


**టీ మీడియా ,ఫిబ్రవరి 21,ఆత్మకూరు ;**



వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో బిజెపి మండల విస్తృతస్థాయి సమావేశంలో భాగంగా గ్రామాల్లో ఉప సర్పంచ్, వార్డు సభ్యులుగా, టౌన్ లో కౌన్సిలర్ సభ్యులుగా గెలుపొందిన వారికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి సన్మానం చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు నాయకులు వారి గ్రామాల్లోని ప్రధాన సమస్యల తెలియజేశారు.ి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని ప్రధాన సమస్య లను ఎంపీ డీకే అరుణమ్మ దృష్టికి తీసుకువెళ్లి అతి త్వరలోనే పరిష్కరిస్తాను అని హామీ ఇచ్చారు. మూడు స్థానాలు గెలిచి టౌన్ లో ఓటు బ్యాంకు ని పెంచుకోవడం శుభ పరిణామం అన్నారు . సీనియర్ నాయకులు రేచింతల శ్రీనివాసులు మాట్లాడుతూ బూతుస్థాయిలో పార్టీని పటిష్టం చేయాలని రాబోయే ఎంపిటిసి జెడ్పిటిసి ఎన్నికల్లో బిజెపి సత్తా చాటాలని తెలియజేశారు. మండల అధ్యక్షులు అశోక్ భూపాల్ మాట్లాడుతూ మండలానికి 2 సంవత్సరాలు ఎంపీ నిధులు చాలా తక్కువగా వచ్చాయని రాబోయే సంవత్సరంలో మండల కేంద్రానికి 2 కోట్లకు పైగా నిధులు ఇవ్వాలని కోరారు. మండల అధ్యక్షులు అశోక్ భూపాల్ పట్టణ అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీలు,సీనియర్ నాయకులు కే ఆనంద్, జిల్లా కౌన్సిల్ నెంబర్ ఆంజనేయులు ముదిరాజ్, జిందే శ్రీనివాసులు , విష్ణువర్ధన్ రెడ్డి ,ఉప సర్పంచులు వార్డు మెంబర్లు కౌన్సిలర్లు బూత్ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి

**టీ మీడియా, ఫిబ్రవరి 21, వనపర్తి బ్యూరో :**



గోపాలపేట మండలం బుద్దారం గ్రామానికి చెందిన కావలి అర్జునయ్య, ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు నవీన్, లాస్యల వివాహానికి హాజరై నూతన వధూవరులను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆశీర్వదించారు.మాజీ మంత్రి వెంట సర్పంచ్ శేఖర్ గౌడ్, యస్.శ్రావణ్ కుమార్,ఉప సర్పంచ్ శివాజీ,మాజీ సర్పంచ్ వెంకటయ్య, మాజీ సర్పంచ్ జాంప్ల, మాజీ ఎంపీటీసీ అగ్రు విష్ణు,కావలి కృష్ణయ్య,కృష్ణా రావు,లచ్చ గౌడ్,లక్ష్మయ్య,గోపాల్ రావు,బొగ్గు కుర్మయ్య, వెంకటస్వామి,దస్తగిరి,ఓంకార్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ క్రీడలకు పెద్దపీట

- క్రీడలు అభివృద్ధి కోసం 760 కోట్లను కేటాయించిన ప్రభుత్వం

**టీ మీడియా, ఫిబ్రవరి 21, వనపర్తి బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కోసం రూ. 760 కోట్లను కేటాయించిందని, ఉన్నత విద్యతోపాటు అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. సీఎం కప్ రెండో ఎడిషన్ క్రీడా పోటీల్లో భాగంగా శనివారం వనపర్తి పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న సెపక్తక్రా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి తో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వనపర్తికి ఒక ప్రత్యేకత ఉందని ఇదే పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆటలాడారని ఆయన తెలిపారు.విద్యా ప్రతిగా పేరున వనపర్తి నేడు క్రీడలపర్తిగా మారుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి క్రీడల శాఖ వాకిటి శ్రీహరి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కొత్త కాపు శివసేన రెడ్డి వనపర్తి కి చెందినవారవడం మన అదృష్టమని క్రీడల పరంగా ఎన్ని అవకాశాలున్న మనం వాటిని పూర్తిస్థాయిలో వినిగించుకునేలా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. తెలంగాణ రాష్ట్రం కంటే చిన్న చిన్న దేశాలే బంగారు పథకాలు సాధిస్తుంటే భారతదేశ వెనుకబడి పోతుందని అలాంటి దేశంలో తెలంగాణ రాష్ట్రం క్రీడల పరంగా ముందుండేలా చేసేందుకే ముఖ్యమంత్రి క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వారు తెలిపారు.విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారని వసతి గృహాల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు మెస్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలను పెంచుకోవడంతో పాటు సన్న బియ్యం పంపిణీ చేసేవారు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. క్రీడలతో మానసికోలాసంతో పాటు దేహదారుఢ్యం పెంపొందితోందని, ప్రతి ఒక్కరు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని ఆటలు వాడే సమయంలో స్ఫూర్తిదాయకంగా ఉండాలని కక్షపూరితంగా ఉండకూడదని వారు సూచించారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్లు, జిల్లా క్రీడా శాఖ అధికారులు, క్రీడాకారులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రసాద్' పనుల్లో జాప్యం

- సింహాచలంలో భక్తులకు తప్పని ఇబ్బందులు
- కొనసాగుతున్న పనులు




**టీ మీడియా, ఫిబ్రవరి 21, సింహాచలం:**

అప్పన్న దేవస్థానంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలోని చేపట్టిన పనులు ప్రసాద్ పథకం పనులు ఇంకా పలు దశల్లోనే కొనసాగుతున్నాయి. అయితే చందనోత్సవం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఈ పనులు మరొకసారి చర్చనీయాంశమయ్యాయి. అంతేకాకుండా గతేడాది ఏప్రిల్? 30వ తేదీన చందనోత్సవం రోజున గోడ కూలి ఏడుగురు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో కొన్ని నెలల పాటు పనులు నిలిచిపోయాయి. అయితే గుత్తేదారును బ్లాక్?లిస్టులో పెట్టి కొత్తవారికి పనులను అప్పగించడం గమనార్హం. ఏప్రిల్ 20వ తేదీన జరిగేటటువంటి చందనోత్సవం కంటే ముందుగానే పూర్తయిన నిర్మాణాలేమైతే ఉన్నాయో వాటిని అప్పగించాల్సిందిగా దేవస్థాన అధికారులు ఇప్పటికే పర్యాటక శాఖను కోరుతున్నారు.

**ప్రసాద్ పనుల్లో అంతులేని జాప్యం**

ప్రధానంగా ఎన్టీఆర్ ఘాట్ సమీపంలో వ్యూపాయింట్ నిర్మిస్తున్నప్పటికీ రూ.5.40 కోట్ల వ్యయంతో సింహగిరి రెండో ఘాట్?రోడ్డు ప్రవేశం వద్ద దాదాపు 4 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న బస్ కాంప్లెక్సు నిర్మాణం 80 శాతం పూర్తయింది. అదే విధంగా ఫుడ్ కోర్టులు, దుకాణాలు, టాయిలెట్ల నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయి. మొత్తం రూ.4.78 కోట్ల వ్యయంతో కొండ దిగువన చేపట్టినటువంటి పుష్కరిణి సత్రం రెండు బ్లాకుల నిర్మాణం దాదాపుగా చివరి దశకు చేరింది. రూ. 11.20 కోట్లతో జీప్లస్ వన్ భవనం: అదే విధంగా రూ.3.80 కోట్ల వ్యయంతో గతంలో చేపట్టిన తొలిపావంచా, మెట్లమార్గం అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోవడం గమనార్హం. హిల్?టాప్ రహదారి మార్గంలో యాత్రికులు వేచి ఉండేందుకు రూ. 11.20 కోట్ల వ్యయంతో నిర్మించిన జీప్లస్ వన్ భవనం పూర్తయింది. ప్రస్తుతం దీనికి ఇంకా తుదిమెరుగులు దిద్దాల్సి ఉంది. నృసింహ మండపంలో 500 మంది కూర్చునే విధంగా నిర్మిస్తున్నటువంటి యాంపీ థియేటర్ పనులు మాత్రం ఇంకా మిగిలే ఉన్నాయి. ముఖ్యంగా ఉత్తరగోపురం ఎదురుగా పాత కల్యాణోత్సవ ప్రాంగణంలో వార్షిక కల్యాణాన్ని నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అంతేకాకుండా సింహగిరిపై రూ. 5.60 కోట్ల వ్యయంతో చేపట్టిన దుకాణ సముదాయ నిర్మాణం ఇప్పటికే పూర్తయ్యాయి. అయితే ప్రస్తుతం దీన్ని వ్యాపారులకు అప్పజెప్పి వినియోగంలోనికి తీసుకొచ్చారు. అదే రీతిలో దక్షిణ వైపున సింహాచల దేవస్థానం ఆధ్వర్యంలో మెట్ల నిర్మాణాన్ని ఇంకా జరగాల్సి ఉంది. సింహాచలం దేవస్థానంలో రూ. 3.46 కోట్ల వ్యయంతో చేపట్టిన పర్యాటక సమాచార భవనం, ఫుడ్?కోర్టులు, సోలార్ విద్యుత్తు ప్లాంటు నిర్మాణాలపై దేవాదాయ శాఖ కమిషనర్ కొన్ని అభ్యంతరాలను చెప్పినప్పటికీ అప్పటి ఇంజినీరింగ్ అధికారులు మాత్రం కొనసాగించారు.

**ప్రారంభం కాని యాగశాల**

అంతేకాకుండా రూ. 7.70 కోట్లతో చేపట్టిన వివధ పనుల్లో కొన్ని పనులు ఇంకా ప్రారంభమే కాకపోవడం ఆశ్చర్యకరం. ప్రధానంగా త్రిపురాంతక స్వామి ఆలయం క్యూ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయింది. ఇది అప్పగించినట్లయితే చందనోత్సవం రోజు భక్తుల కోసం క్యూ లైన్లను ఇక్కడే ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆలయంలో ఎలివేటర్, పార్కింగ్? ప్రాంగణాలను ఇంకా ప్రారంభించనేలేదు. దేవస్థాన ప్రాంగణంలో నిర్మించవలసిన యాగశాల ఇంతవరకు ప్రారంభమే కాలేదు. ఇవి మాత్రమే కాకుండా రూ.3.75 కోట్ల వ్యయంతో పాన్ ప్రాంత అభివృద్ధి, ఆరు ఎలక్ట్రిక్ మినీ వ్యాన్లు, డిజిటల్ సూచిక బోర్డులు, బ్యాగేజీ స్క్రీనింగ్, సెక్యూరిటీ వ్యవస్థ, మెటల్ డిటెక్టర్లు, తదితర సదుపాయాలను కల్పించాల్సి ఉన్నది. దీనికితోడు ఇటీవల ఇంజినీరింగ్? అధికారుతో సమీక్షను నిర్వహించిన ఈవో వెంకటరావు పూర్తయిన నిర్మాణాలు ఏమైతే ఉన్నాయో వాటిని దేవస్థానానికి తక్షణమే సమర్పించాల్సిందిగా కోరారు. ప్రసాదం పథకానికి సంబంధించిన వివరాలను ప్రధానంగా పరిశీలించినట్లయితే సింహాచలం దేవస్థానానకి కేంద్రం మంజూరు చేసింది రూ. 54 కోట్లుగా ఉంది. వీటిని 2023వ సంవత్సరం డిసెంబర్ నెలలో మంజూరు చేసింది. దీనికి వర్చువల్ విధానంలో ప్రధాని మోదీతో శంకుస్థాపన 2024 మార్చి 7వ తేదీన జరిగింది. నిర్మాణానికి గడువును 2024 డిసెంబర్ నాటికి పూర్తవ్వాలని నిర్ణయించారు. పనుల్లో ఏమైనా జాప్యం జరిగితే దాన్ని 2025 మార్చి వరకు పొడిగించింది.

# రెండు రాజ్యసభ సీట్లు ఖాళీ

(మొదటిపేజీ తరువాయి..)

సీట్లలో ఒకటి కచ్చితంగా అధిష్టానం కోటాలోకి వెళ్తుంది. ఆ లెక్కన చూస్తే....ప్రస్తుతం ఎంపీగా ఉన్న పార్టీ సీనియర్ అభిషేక్ మనుసింఘ్వినే కొనసాగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. రాష్ట్రానికి సంబంధించిన అనేక కేసుల విషయంలో ఆయన అవసరం చాలా ఉన్నట్టు చెబుతున్నారు. పైగా... హైకమాండ్‌కు ఆయన చాలా దగ్గర వ్యక్తి. అందుకే సింఘ్విని కొనసాగించేందుకు ఢిల్లీ పెద్దలు కూడా సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో ఎన్నిక జరిగే రెండిటిలో ఇక ఒక సీటే మిగులుతుంది. దాని కోసం రేస్‌లో చాలామందే ఉన్నారు. దీంతో... ఎంపిక ఏ ప్రాతిపదికన జరుగుతుందన్న చర్చలు జోరుగా నడుస్తున్నాయి. పార్టీ కోసం లాయలిస్టులుగా ఉన్న వాళ్లకు అవకాశం ఇస్తారా..? అధిష్టానం ఏం నిర్ణయిస్తే అదే ఫైనలా లేక స్టేట్ ప్రయారిటీస్ ఉంటాయా లాంటి రకరకాల ప్రశ్నలు వస్తున్నాయి. ఎంపిక ప్రక్రియపై రాష్ట్ర నాయకత్వం కసరత్తు మొదలుపెట్టిన క్రమంలో....పార్టీ వర్గాల్లో రకరకాల పేర్లు చక్కర్లు కొడుతున్నాయి. ఇందులో మొదటి వరుసలో ఉన్నారు పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు. రాజ్యసభ సీటు విషయమై సీఎం రేవంత్ రెడ్డి ఆనకు మాట ఇచ్చారన్న ప్రచారం కూడా జరుగుతోంది. వీహెచ్‌కే రాజ్యసభ టికెట్ ఇవ్వాలంటూ రాహుల్ గాంధీని కోరేందుకు ఆల్రెడీ ఢిల్లీ వెళ్ళారు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి. పార్టీకి లాయల్.. పార్టీ కోసం ఈ వయస్సులో కూడా పని చేస్తున్న విహెచ్‌కు గౌరవం దక్కాల్సిందేనంటూ వత్తిడి పెంచే పనిలో ఉన్నారు.

జగ్గారెడ్డి. బీసీ కోటాలో హనుమంతరావుకు అవకాశం ఇస్తే పార్టీ ఇప్పుడు అందుకున్న బీసీ నినాదానికి మరింత బలం చేకూర్చినట్టు అవుతుందన్న మాటలు కూడా వినిపిస్తున్నాయి. ఇదే బీసీ కోటాలో మరో సీనియర్ నేత మధు యాష్కి కూడా ప్రయత్నాలు మొదలుపెట్టారు. సీఎంని కలిసి మద్దతు కోరే ప్రయత్నాల్లో ఉన్నారాయన. ఇక రెడ్లకు ఇవ్వాల్సి వస్తే మాత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి రేస్‌లో ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. గతంలో కూడా ఇలాంటి చర్చే జరిగిందిగానీ... వర్కౌట్ అవలేదు. కానీ... ఈ సారి పార్టీతో పాటు కొందరు ఎమ్మెల్యేలు కూడా ఆయన పేరు సూచిస్తున్నట్టు సమాచారం. మరోవైపు సీనియర్ నేత కోదండ రెడ్డి కూడా రాజ్యసభ రేసులో ఉన్నారు. ఇక ఎస్టీ కోటాలో బెల్లయ్య నాయక్ కూడా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. గతంలో ఆయన ఎమ్మెల్యే, ఎంపీ టిక్కెట్స్ ఆశలు పెట్టుకున్నా ఏవీ దక్కలేదు. అందుకే ఈ సారైనా తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు బెల్లయ్య నాయక్. కమ్మ సామాజిక వర్గం కోటాలో తన మిత్రుడు జెట్టి కుసుమ కుమార్‌కి అవకాశం ఇప్పించాలని ప్రయత్నం చేస్తున్నారు జగ్గారెడ్డి. అయితే వీహెచ్, లేదంటే జెట్టికి ఇవ్వాలంటూ వత్తిడి చేసేందుకు హస్తిన రైలెక్కారు జగ్గన్న. రాబోయే గ్రేటర్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని.. ఈ అవకాశం ఇవ్వాలని ఆయన కోరుతున్నట్టు తెలుస్తోంది. మొత్తానికి రాజ్య సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ లో రేసు మొదలైంది. టికెట్ ఎవరిని వరిస్తుంది..! అధిష్టానం మనసులో ఎవరున్నారు అనేది చూడాలి.

## పేదింటి ఆడపిల్ల పెళ్లికి మేఘన్న కానుక

**టీ మీడియా, ఫిబ్రవరి 21,పెబ్బేరు:**



శనివారం పెబ్బేరు మున్సిపాలిటీలో పేదింటి ఆడపిల్ల పెళ్లికి అండగా నిలబడాలనే సామాజిక బాధ్యతతో శనివారం పెబ్బేరు నూతన మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ తమ సొంత ఖర్చుతో పేదింటి ఆడపిల్ల పెళ్లికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేరుతో'మేఘన్న పెళ్లి కానుక తో రూ 3 వేలు పెళ్లి వస్త్రాలను మున్సిపాలిటీలోని 6వ వార్డులో సంకుల శాంతమ్మ శీను దంపతుల కూతురు దీపిక పెళ్ళికి ఆర్థిక సాయం చేశారు పేదింటి ఆడపిల్ల పెళ్లికి మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ అందించిన మేఘన్న పెళ్లి కానుక ఆర్థిక సహాయం ఆ కుటుంబానికి ఎంతో కొండంత అండగా నిలిచింది మీ ఉదారతకు పేదల పట్ల మీకున్న మమకారానికి పెళ్లికూతురు దీపిక కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలుపుతూ మీ సేవలు ఇలాగే కొనసాగాలని కోరారు ఈ కార్యక్రమంలో తాటికొండ కృష్ణ నాయకులు సుధాకర్ గౌడ్దూపం రాజలింగం తాటికొండ ఆంజనేయులు సంకుల శ్రీను దూపం రంగస్వామి కప్పరి గోకరి మోతె శ్రీను దూపం దశరథం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తృటిలో తప్పిన పెను ప్రమాదం


**టీ మీడియా ఫిబ్రవరి 21, టేక్మాల్ ప్రతినిధి:**



మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని ఎల్లుపేట ప్రధాన రహదారిపై శనివారం ప్రమాదం చోటుచేసుకుంది పశువుల గడ్డి లోడ్ తో వెళ్తున్న లారీకి ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో ఒక్కసారిగా మంటలు చెల్లరేగాయి ఇది గమనించిన స్థానికులు వెంటనే స్పందించి కరల సాయంతో గడ్డిని లారీ నుంచి బయటకు తోసివేసి పెను ప్రమాదాన్ని తప్పించారు ఈ ఘటనలో ఎవరికి గాయాలు కాకపోవడం అందరూ ఊపిరిపించుకున్నారు మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## మాతృభాషపై మమకారం పెంచుకోవాలి

**టీ మీడియా, ఫిబ్రవరి 21,వనపర్తి బ్యూరో :**



ప్రతి ఒక్కరూ మాతృ భాషపై మమకారం పెంచుకోవాలనీ సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కళావేదిక పక్షాన తెలుగు భాషకు సేవలందించిన పలువురు సాహితీవేత్తలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ ఇతర భాషలపై వ్యామోహంతో ఉపాధి అవకాశాల కోసం పరాయి భాషలను ప్రోత్సహిస్తే మాతృ భాషల మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందని అభిప్రాయ పడ్డారు. తల్లిదండ్రులు బాల్యం నుంచే తమ పిల్లలకు తమ మాతృ భాషపై ఆసక్తిని గౌరవాన్ని పెంపొందించాలని శంకర్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సాహితీవేత్తలు సందాపురం బిచ్చయ్య,కందూరు నారాయణ రెడ్డి, జనజ్వాల,కొత్తకాపు నారాయణ రెడ్డి,మందాపురం సుజాతమ్మ,యం. ఏ . సత్తార్,తదితరులను శాలువాలతో సత్కరించారు. ఈనాటి కార్యక్రమంలో వ్యాఖ్యాత బైరోజు చంద్ర శేఖర్,బెల్లంపల్లి శ్రీనివాసులు, బండారు శ్రీనివాస్ మున్నగువారు పాల్గొన్నారు.



## శాసనసభ ఎన్నికల్లో బిజెపి గెలుపు లక్ష్యంగా పనిచేస్తాం


**టీ మీడియా, ఫిబ్రవరి 21, వనపర్తి బ్యూరో :**

పాత్రికేయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మాట్లాడుతూ తాజాగా జరిగిన వనపర్తి మున్సిపల్ ఎన్నికలలో పట్టణ ఓటర్లు భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను 33 వార్డులలో ఆశీర్వదించి పెద్ద ఎత్తున కమలం పువ్వు గుర్తుపై ఓటు వేయడం జరిగిందని ఓటరు మహాశయులకు జిల్లా పార్టీ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు 31 వార్డులకే పరిమితమయ్యాయని బిజెపి మాత్రం 33 వార్డులలో పోటీ చేసిందని 17 వ వార్డులో డి. నిర్మల నారాయణ 260 ఓట్ల మెజారిటీ 26 వార్డులో ఎం. విజయసాగర్ 34 ఓట్ల మెజార్టీతో గెలుపొందడం జరిగిందని పదో తేదీ సాయంత్రం వరకు బిజెపి అభ్యర్థులు దాదాపు 12 వార్డులలో గెలవబోతున్నారనే ఇంటలిజెన్స్ సమాచారంతో కాంగ్రెస్ పార్టీ తెల్లవారు జామున మూడు గంటల నుండి 5:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేసి పెద్ద ఎత్తున డబ్బు పంపిణీ చేసిందని ఓటుకు 4000 నుండి 8000 వరకు పంపిణీ చేశారని కాంగ్రెస్ కౌన్సిలర్లు గెలవకపోతే వార్డులలో అభివృద్ధి జరగదని స్కీములన్ని నిలిపివేస్తారని ఓటర్లను బెదిరించి ఎక్కువ వార్డులో కాంగ్రెస్ పార్టీ గెలిచినా బిజెపి పార్టీదే నైతిక విజయం అని 4,13, 24, 28, 29, 32 వార్డులలో స్వల్ప తేడాతో బిజెపి కౌన్సిలర్లు ఓడారని ఓటమికి అధైర్య పడకుండా కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు అయ్యేవరకు నిరంతరం ప్రజల పక్షాన పోరాటం కొనసాగుతుందని కాంగ్రెస్ టిఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు బిజెపి వైపు రావాలనుకుంటే బిజెపి పార్టీ తలుపులు తెరిచే ఉంచామని రాబోయే రెండు నెలల్లో వనపర్తి పట్టణం మరియు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున పార్టీలోకి చేరికలు జరగబోతున్నాయని 2029 శాసనసభ ఎన్నికల్లో బిజెపి గెలుపు లక్ష్యంగా పనిచేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. పాత్రికేయ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు 26వ వార్డు కౌన్సిలర్ ఎం. విజయసాగర్ ఎస్సీ మోర్చామాజీ జిల్లా అధ్యక్షులు ఆగపోగు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు మొట్టికాయల ఎఫెక్ట్

- భారత్‌పై అమెరికా సుంకం 10 శాతానికి డౌన్

**టీ మీడియా, ఫిబ్రవరి 21, ఢిల్లీ బ్యూరో:**



ప్రపంచ దేశాలపై ఏకపక్షంగా సుంకాలను బాదిన వ్యవహారంలో అమెరికా సుప్రీంకోర్టు శుక్రవారం మొట్టికాయలు వేయడంతో ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ దిద్దుబాటు చర్యలను మొదలుపెట్టారు. తాజాగా శనివారం ఆయన మరో కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను జారీ చేశారు. అమెరికా వాణిజ్య చట్టం-1974లోని సెక్షన్ 122 ప్రకారం ప్రపంచ దేశాలపై 10 శాతం సుంకాలను విధిస్తానని కొత్త ఆర్డర్‌లో ట్రంప్ వెల్లడించారు. దీంతో భారత్‌పై అమెరికా విధిస్తున్న 18 శాతం దిగుమతి సుంకం కాస్తా 10 శాతానికి తగ్గనుంది. ప్రపంచ దేశాలపై విధించిన సుంకాలను తగ్గించే కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేసిన అనంతరం సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఒక పోస్ట్ పెట్టారు. సుంకాలను తగ్గించే తన ఆర్డర్ దాదాపుగా వెంటనే అమల్లోకి వస్తుందని ఆయన వెల్లడించారు.

**భారతే మాకు సుంకాలను చెల్లిస్తుంది మేం చెల్లించం : ట్రంప్**

ప్రపంచ దేశాలపై విధించిన సుంకాలను తగ్గించమని అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు భారత్‌తో మంచి సంబంధాలు ఉన్నాయని ఆయన అన్నారు. భారత్‌తో తమ వాణిజ్యం కొనసాగుతోందని చెప్పారు. భారత్‌తో ఖరారైన ట్రేడ్ డీల్‌పై సుప్రీంకోర్టు తీర్పు ప్రభావం ఉంటుందా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, ఎలాంటి మార్పులూ ఉండవని ట్రంప్ స్పష్టం చేశారు. భారతే తమకు సుంకాలను చెల్లిస్తుందని, తాము భారత్‌కు సుంకాలను కట్టేది లేదన్నారు. గతంలో జరిగిన దానికి రివర్స్‌లో ఇప్పుడు పరిస్థితులు ఉన్నాయని ట్రంప్ వ్యాఖ్యానించారు. అన్ని ప్రపంచ దేశాలతో అమెరికా కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలు అమల్లోనే ఉంటాయన్నారు. సుంకాలను తగ్గించమనే తీర్పును ఇచ్చిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులను చూస్తుంటే సిగ్గేస్తోందని ట్రంప్ తెలిపారు. అమెరికాకు అవసరమైన పనులను చేసే ధైర్యం ఆ జడ్జీలకు లేదన్నారు. అమెరికాను కాపాడుకునేందుకే తాను ప్రపంచ దేశాలపై సుంకాలను పెంచానని ఆయన చెప్పారు. తాను ఇప్పటివరకు పెంచిన సుంకాల కంటే ఇంకా ఎక్కువ సుంకాలను పెంచే అధికారం అమెరికా అధ్యక్షుడికి ఉంటుందని ట్రంప్ కామెంట్ చేశారు.

**ఫిబ్రవరి 24 నుంచి ఆర్డర్ అమల్లోకి**

'ప్రపంచ దేశాలపై అమెరికా ప్రభుత్వం తగ్గించిన దిగుమతి సుంకాలు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి 150 రోజుల పాటు అమల్లో ఉంటాయి. ఫార్మా ఉత్పత్తులు, అమెరికాకు అవసరమైన వస్తువులు, సరుకులకు ఈ సుంకాల నుంచి మినహాయింపులు కంటిన్యూ అవుతాయి. అమెరికా - మెక్సికో - కెనడా ఒప్పందంలో భాగంగా అమెరికాలోకి వచ్చే సరుకులకూ మినహాయింపులను కొనసాగిస్తాం' అని పేర్కొంటూ వైట్ హౌస్ ఒక ఫ్యాక్ట్ షీట్‌ను విడుదల చేసింది.

**10 శాతం సుంకం భారత్‌కూ వర్తిస్తుంది**

'భారత్ లాంటి వాణిజ్య భాగస్వాములు ఇప్పటికే అమెరికాతో ట్రేడ్ డీల్స్‌ను ఖరారు చేసుకున్నాయి. 18 శాతం దిగుమతి సుంకాన్ని చెల్లించేందుకు గతంలో భారత్ సిద్ధపడినప్పటికీ, ట్రంప్ కొత్తగా ఇచ్చిన 10 శాతం సుంకాల ఆదేశం భారత్‌కూ వర్తిస్తుంది' అని వైట్ హౌస్ తెలిపింది.

**ట్రేడ్ డీల్‌లో ఖరారైన సుంకాల అమలుకు యోచన**

గత ఏడాది వ్యవధిలో చాలా ప్రపంచ దేశాలతో అమెరికా వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకుంది. ఇటీవలే భారత్‌తోనూ ట్రేడ్ డీల్‌ను ఖరారు చేసుకుంది. ట్రేడ్ డీల్స్ కుదుర్చుకున్న దేశాలపైనా దిగుమతి సుంకాలను అమెరికా భారీగా పెంచింది. ఫలితంగా భారత్‌పై విధించే దిగుమతి సుంకం 18 శాతానికి చేరింది. అమెరికాతో ట్రేడ్ డీల్ చర్చల వేళ 18 శాతం సుంకాన్ని చెల్లించేందుకు భారత్ అంగీకారం తెలిపింది. ఈ చర్చల సమయంలో ఖరారైన దిగుమతి సుంకాలనే అమలు చేసేందుకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను ట్రంప్ ప్రభుత్వం అన్వేషిస్తోందని వైట్ హౌస్ అధికారి ఒకరు తెలిపారు. ఈ దిశగా ప్రస్తుతం కసరత్తు జరుగుతోందని ఆయన చెప్పారు. దీంతో 10 శాతం సుంకాన్ని భారత్‌కు వర్తింపజేసే విషయంలో ట్రంప్ సర్కారు రాబోయే రోజుల్లో యూటర్న్ తీసుకుంటుందనే ఆందోళనలు అలుముకున్నాయి.

**150 రోజుల తర్వాత పరిస్థితి మళ్లీ మొదటికొస్తుందా ?**

ప్రపంచ దేశాలపై విధించే సుంకాన్ని 10 శాతం చేస్తూ ట్రంప్ ఇచ్చిన ఆదేశం 150 రోజుల పాటు అమల్లో ఉంటుంది. ఆ తర్వాత అమెరికా కాంగ్రెస్‌లో ట్రంప్ ఆదేశంపై ఓటింగ్ జరుగుతుంది. ప్రెసిడెంట్ ట్రంప్ కార్యనిర్వాహక ఆదేశం అమలు గడువును పొడిగించే తీర్మానాన్ని అమెరికా కాంగ్రెస్ ఆమోదించాల్సి ఉంటుంది. కాంగ్రెస్ ఆమోదం లభిస్తేనే, ఆ ఆదేశం అమలు కొనసాగుతుంది. లేదంటే, అమెరికా వాణిజ్య లోటును ఎదుర్కొంటోందనే అంశాన్ని బూచిగా చూపించి మళ్లీ ప్రపంచ దేశాలపై సుంకాల బాదుడును ట్రంప్ మొదలుపెట్టే అవకాశాలు ఉంటాయని వాణిజ్యరంగ పరిశీలకులు అంటున్నారు.

# పేదలకు అండగా ఉంటాం

(మొదటిపేజీ తరువాయి..)

ఇబ్బందులు వస్తున్నాయి. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తున్నాం. ప్రతి ఒక్కరికీ అన్నం పెట్టాలన్న ఉద్దేశంతో రూ.5కే భోజనం పెడుతున్నాం. మెరుగైన జీవన ప్రమాణాల కోసం పీ4 కార్యక్రమం తీసుకొచ్చాం. ఆదాయం పెంచే మార్గాలను నేర్పించి వారిని ఆదుకుంటున్నాం" అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

**మీ పొలాల వద్దకు సాంకేతికత**

"ప్రపంచంలో ఉన్న సాంకేతికతను మీ పొలాల వద్దకు తీసుకొస్తున్నాం. దిల్లీలో జరిగిన ఏఐ సదస్సులో 60 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారనేది ప్రజలు గమనించాలి. అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నాం. ప్రజలకు మేలు చేసేందుకే ప్రతి క్షణం ఆలోచిస్తున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చాక వచ్చిన మార్పులు గమనించాలి. రోడ్లపై గుంతలు పూడుస్తున్నాం, కొత్తవి వేస్తున్నాం. ఏడుకొండలవాడికి అపచారం చేసే స్థాయికి వచ్చారు. ఇప్పుడు మళ్లీ ప్రతిచోటా ప్రజలను రెచ్చగొడుతున్నారు. డ్రగ్స్ మత్తులో ఆడబిడ్డల జోలికొస్తే వారికదే చివరిరోజు అవుతుంది. నేను జైలుకు వెళ్లాల్సి వస్తుందని కలలో కూడా అనుకోలేదు. రాష్ట్రాన్ని, ప్రజలను కాపాడేందుకే జైలుకు వెళ్లా. నేరగాళ్లను రాజకీయాలకు దూరంగా ఉంచాలి. వేంకటేశ్వరస్వామి ఫొటోలను మండలికి తీసుకెళ్లారంటే ఏమనాలి? రాష్ట్రంలో పెనుమార్పులు తెచ్చేందుకు కృషి చేస్తున్నా. మన యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని అనుకుంటున్నా. ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలని భావిస్తున్నా" అని సీఎం చంద్రబాబు తెలిపారు.

## ఆదాయానికి మించిన ఆస్తులు

- కల్వకుర్తి ఏడీఏ ఇంట్లో ఏసీబీ సోదాలు

**టీ మీడియా, ఫిబ్రవరి 21, గరిడేపల్లి:**




నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తి ఏడీఏగా పనిచేస్తున్న సుందర్ కిరణ్ కుమార్ నివాసంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. పొనుగోడు గ్రామంలోని ఆయన నివాసంతో పాటు బంధువుల ఇళ్లలోనూ ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. మొత్తం ఏడు ప్రాంతాల్లో దాడులు చేపట్టినట్లు అధి కారులు వెల్లడించారు. గడ్డిపల్లి గ్రామంలోని బంధువుల ఇల్లు, అనంతగిరి మండలంలోని అమీనాబాద్, తుక్కుగూడతో పాటు నేరేడుచర్ల మండలం చిల్లపల్లి వద్ద ఆయనకు భాగస్వామ్యం ఉన్న రైస్ మిల్, కల్వకుర్తిలోని ఇతర ఆస్తులపై సోదాలు కొనసాగినట్లు సమాచారం. గతంలో ఆయన సూర్యాపేట జిల్లా డీఆర్డీఏ పీడీగా పనిచేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఫిర్యాదు లు రావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మహబూబ్న గర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు. సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఆస్తుల వివరాలపై పరిశీలన కొనసాగుతోందని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో రాజకీయ అండదండలతో అగ్రికల్చర్ డి పార్ట్మెంట్ నుంచి డిప్యూటేషన్ పై సూర్యాపేట జిల్లాకు వచ్చి చాలా అక్రమాలకు పాల్పడ్డారని ఆయనపై ఆరోపణలు ఉన్నాయి.

## కూకట్‌పల్లిలో అగ్నిప్రమాదం

**టీ మీడియా, ఫిబ్రవరి 21,హైదరాబాద్:**




కూకట్‌పల్లిలోని ఒక వాణిజ్య సముదాయంలో శనివారం అగ్నిప్రమాదంసంభవించింది. ఈ ఘటనలో కాంప్లెక్స్‌లోని మొబైల్ దుకాణం దగ్ధమైంది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. దుకాణాలు మూసివేయడంతో పెద్ద నష్టం తప్పింది. కాంప్లెక్స్‌లో మంటలు చెలరేగుతున్నట్లు గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది గంటలోపు మంటలను అదుపులోకి తెచ్చారు. మంటలు ఇతర దుకాణాలకు వ్యాపించకుండా నిరోధించడానికి అగ్నిమాపక సిబ్బంది అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. అగ్నిప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే, దుకాణదారులు తమ దుకాణాల్లో ఉన్న స్టాక్ సురక్షితంగా ఉందో లేదో తనిఖీ చేయడానికి పరుగెత్తారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అగ్నిప్రమాదానికి కారణాన్ని తెలుసుకోవడానికి మొబైల్ దుకాణ యజమాని నుండి మరిన్ని వివరాలను సేకరిస్తున్నారు.

## భారత్‌లోకి భారీగా పెట్టుబడులు

(మొదటిపేజీ తరువాయి..)

ప్రజలకు అందేలా చేయాలని అన్ని దేశాలు అంగీకరించాయని ఆయన తెలిపారు. భారతీయ సంస్కృతిలో మూల సూత్రమైన 'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' అనే మంత్రాన్ని ఏఐ టెక్నాలజీ అమలులో అంతర్జాతీయ సూత్రంగా ఈ సదస్సు గుర్తించించినట్లు చెప్పారు. అమెరికా, చైనా, బ్రిటన్, రష్యా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, కెనడా, జపాన్, ఇటలీ, ఇజ్రాయెల్, జర్మనీ, సింగపూర్, దక్షిణ కొరియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఉక్రెయిన్, యూరోపియన్ యూనియన్, వంటి దేశాలు ఈ డిక్లరేషన్‌పై సంతకాలు చేశాయి. పొరుగు దేశాలైన నేపాల్, శ్రీలంక, భూటాన్ కూడా ఇందులో భాగస్వాములయ్యాయి. ప్రపంచ దేశాలన్నీ ఏకగ్రీవంగా భారత్ పక్షాన నిలవడం గర్వకారణంగా ఉందని మంత్రి తెలిపారు. ఏఐ వనరులను కేవలం కొన్ని ధనిక దేశాలు లేదా కొన్ని కార్పొరేట్ సంస్థలకే పరిమితం చేయకుండా, వాటిని ప్రజాస్వామ్యబద్ధం చేయాలని తాము కోరినట్లు చెప్పారు. ఈ సాంకేతికత ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి, ప్రపంచంలోని ప్రతి మూలకు చేరాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ దార్శనికతను ప్రపంచం ఇప్పుడు అధికారికంగా ఆమోదించిందన్నారు.

**గ్లోబల్ సౌత్ నుంచి తొలి అడుగు**

ఏఐ సాంకేతికతపై సాధారణంగా అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాల్లోనే చర్చలు జరుగుతుంటాయి. అయితే, గ్లోబల్ సౌత్ నుంచి ఇటువంటి భారీ ఏఐ సదస్సును నిర్వహించిన ఘనత భారత్‌కు దక్కింది. అభివృద్ధి చెందుతున్న దేశాల అవసరాలను, అక్కడ ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ఏఐ పాలన, భద్రత వంటి అంశాలపై దిల్లీ వేదికగా విస్తృతమైన చర్చలు జరిగాయి. భారతదేశం నుంచి స్టార్టప్ వ్యవస్థాపకులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించి, భారతీయ మేధాశక్తిని ప్రపంచానికి పరిచయం చేశారు.